# మన కబుర్లు



నెలనెలా సిలికానాంధ్ర విశేషాలు..వివరాలు..

## పార్థివ ఉగాది ఉత్సవానికి స్వర సాహితీ సంగమానికీ ఉరకలేస్తున్న సిలికానాంధ్ర

ఏప్రిల్ 9 వ తేదీన లివర్ మోర్ దేవాలయ ప్రాంగణంలో సిలికానాంధ్ర మరియూ శివ-విష్ణు దేవాలయం సంయుక్త నిర్వహణలో జరగనున్న ఉగాది ఉత్సవానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. గత మూడు సంవత్సరాలుగా ఇదే హాలులో సిలికానాంధ్ర నిర్వహించిన ఉగాది ఉత్సవాలకి, ప్రతిసారీ వెయ్యిమందికి పైగా తెలుగు వారు హాజరు కావడం ఒక విశేషం. ఈ సారి కూడ భారీ ఎత్తున , అచ్చ తెలుగు వాతావరణంలో జరగనున్న ఈ ఉగాది సంబరాలలో ఈ సంవత్సరం పూచిన వేపపువ్వుతో చేసిన ఉగాది పచ్చడి ఆహూతులందరికీ అందిస్తారు.

ప్రధాన కార్యక్రమానికి ముందుగా, బాలబాలికలకి ఏర్పాటు చేసిన తెలుగు భాషా , సంస్కృతీ, సంప్రదాయ పరిచయ పోటీలకి విశేషమైన ప్రతిస్పందన లభిస్తోంది. దాదాపు నూట యాభై మంది చిన్నారులు ఈ పోటీలకి తమ పేర్లని నమోదు చేసుకున్నారు. ముందుగా ప్రకటించినట్లు మధ్యాహ్నం ఒంటిగంటకి కాకుండా ఉదయం 11.00 గంటలకే ఈ పోటీలు మొదలౌతాయి. పోటీలకు నమోదు చేసుకున్న వారందరికీ వారు హాజరు కావలసిన సమయాన్ని సిలికానాంధ్ర కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ ఫోన్ ద్వారానూ, ఇమెయిల్ ద్వారానూ తెలియచేస్తారు. పాల్గొనే వారికీ, వారి తల్లి దండ్రులకీ ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పోటీలు సజావుగా సాగడానికి, మల్లాది రఘు, మల్లాది శ్యామల, డొక్కా వంశీ ల నేతృత్వంలో, అనేకమంది సిలికానాంధ్ర కార్యకర్తలు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

సాయంత్రం సరిగ్గా 5.00 గంటలకి ప్రారంభమయ్యే ప్రధాన కార్యక్రమంలో మారేపల్లి వెంకట శాస్త్రి గారు పంచాంగ పఠనం చేస్తారు. యువకవి ప్రఖ్య వంశీ అధ్యక్షతన జరిగే కవిసమ్మేళనంలో పది మంది కవులూ, కవయిత్రులూ తమ కవితల్ని వినిపిస్తారు. ప్రేక్షకులని కూడా భాగస్వాముల్ని చేసే వినూత్న ప్రక్రియలు రూపొందించబడుతున్నాయి.

ప్రముఖ కవి స్వర్గీయ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికి అంకితమిస్తున్న స్వరసాహితీ సంగమంలో, ప్రత్యేకంగా దేవులపల్లి వారి పాటల ఆడియో సి.డి. 'ఆంధ్ర కాహళి' విడుదల చేయబడుతుంది. కూచిభొట్ల ఆనంద్ నేతృత్వంలో, వక్కలంక సూర్య సంగీత దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ పాటల పండుగలో 20 మంది సిలికానాంధ్ర గాయనీ గాయకులు, 10 మంది సంగీత వాయిద్యకారులు పాల్గొంటున్నారు. ఈ సి.డి. లోని కొన్ని పాటల్ని వేదికమీద లైవ్ గానం చేస్తారు.

సిలికానాంధ్ర కి గుర్తింపుకు కారణమైన ప్రణాళికా బద్ధమైన కార్యక్రమ రూపకల్పనకోసం ప్రతివారం ప్లానింగ్ మీటింగులు జరుగుతున్నాయి. అలానే ప్రచారరంగంలో మొదటినుంచీ కొత్తపుంతలు తొక్కుతున్న

సిలికానాంధ్ర ఈ సారి కూడా సిలికాన్ వేలీలోని తెలుగు వారిని వీలైనంతమందిని వ్యక్తిగతంగా కలుసుకుని ఆ-హ్వానించడం జరుగుతోంది. లివర్ మోర్, ప్లజంటన్, ఫోస్టర్ సిటీ, ఫ్రీమాంట్, శాంటక్లారా, సన్నీవేల్, డబ్లిన్ మొదలైన నగరాలలో సిలికానాంధ్ర కార్యకర్తలు వారాంతాల్లో పర్యటిస్తూ తెలుగు వారిని ఆత్మీయంగాఈ కార్యక్రమానికి  ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా సిలికానాంధ్ర ప్రత్యేకంగా రూపొందించిన పబ్లిసిటీ పోస్టర్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఈ కార్యక్రమానికి ప్రవేశం ఉచితం. అంతే కాక, కార్యక్రమం ముగిసాక రాత్రి 8.00గంటలకి ఆహూతులందరికీ ఉచితంగా కమ్మటి విందు భోజనం కూడా వడ్డిస్తారు. లోగడ అన్నమాచార్య సంకీర్తనోత్సవానికి చేసినట్లే ఈ సారికూడా సిలికానాంధ్ర కార్యకర్తలే స్వయంగా వంటలు చేయబోతున్నారు. ఈ భోజనాలకి కావల్సిన కూరగాయలు, ,నూనెలు, పప్పులు, వగైరా అన్నింటినీ స్థానికంగా వున్న తెలుగు వారి అతిపెద్ద సూపర్ మార్కెట్ 'నమస్తే ప్లాజా' సురేష్ గారు ఉచితంగా సిలికానాంధ్ర కి స్పాన్సర్ చేస్తున్నారు. అలానే, డిలావేర్ లో ఉన్న ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ 'అమెరికన్ సొల్యూషన్స్' కి చెందిన శ్రీ ఇందుకూరి సుబ్బరాజు గారు ఈ ఉగాది కార్యక్రమం మొత్తాన్ని స్పాన్సర్ చేస్తున్నారు. ..ప్రేక్షకుల, అభిమానుల, శ్రేయోభిలాషుల అండదండలే ఆశీస్సులుగా ముందుకి దూసుకెళ్తున్న సిలికానాంధ్ర ఉగాది ఉత్సవానికి మరో సారి మీఅందర్నీ మనసారా ఆహ్వానిస్తున్నాం.

ఈ కార్యక్రమ రూపకల్పన లోని వివిధ దశలనుంచీ కొన్ని చిత్రాలనిక్కడ ఇస్తున్నాం.


నమస్తే ప్లాజా లో నిలువెత్తు పోస్టర్


ప్రతి ఒక్కరినీ పలుకరించి, కార్యక్రమం గురించి వివరించి..


స్వర సాహితీ సంగమం ప్రాక్టీస్..


ప్లానింగ్ మీటింగ్ లో..

## ఆంధ్ర కుటుంబ శిబిరం

క్రిందటేడాది మే నెలలో విజయవంతంగా , ఒక విధంగా ప్రపంచ రికార్డుగా, నిర్వహించబడిన 'ఆంధ్ర కుటుంబశిబిరం' మళ్ళీ మీ ముందుకి రాబోతోంది. మే 6,7,8 తేదీలలో లా హోండా కొండలలో జరగబోయే 'ఆంధ్ర కుటుంబ శిబిరం' గురించిన ప్రకటన ఉగాది కార్యక్రమం రోజున జరుగుతుంది. క్రిందటేడాదిని మించిన అనుభూతుని ఆహ్వానితులకు అందించేందుకు, అనేక వినూత్న కార్యక్రమాలకు కొండిపర్తి దిలీప్ రూపకల్పన చేస్తున్నారు. క్రిందటేడాది ఆంధ్ర కుటుంబ శిబిరం విశేషాలు తెలుసుకునేందుకు ఇక్కడ క్లిక్ చేయండి.. 2004 ఆంధ్ర కుటుంబశిబిరం విశేషాలు

## సింగపూర్ లో సిలికానాంధ్ర

ప్రపంచవ్యాప్తంగా వున్న అనేక ప్రవాసాంధ్ర సంస్థలతో సంభాషిస్తూ సాంస్కృతిక సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించడానికి కృషి చేస్తున్న సిలికానాంధ్ర , లోగడ తెలుగు అసోసియేషన్ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ శాక్రిమెంటో వారితో కలిసి కార్యక్రమాలు నిర్వహించిన సంగతి మీలో చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఈ కృషిలో భాగంగానే మార్చి 23 వ తేదీన సింగపూర్ తెలుగు సమాజం వారి ఆహ్వానం మేరకు అధ్యక్షుడు శ్రీ సత్యమూర్తిగారినీ, సంస్థ ప్రాంతీయ కార్యదర్శి శ్రీ రాజారెడ్డి గారినీ సిలికానాంధ్ర ప్రతినిధి శ్రీ నూకల సిద్ధార్థ సింగపూర్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా సిలికానాంధ్ర వీడియోలనీ, సుజనరంజని పత్రిక ప్రతులనీ సింగపూర్ తెలుగు సమాజానికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సత్యమూర్తి గారు ' సిలికానాంధ్ర ప్రారంభమైన వద్దనుంచీ మేము అత్యంత ఆసక్తి కరంగా పరిశీలిస్తున్నాము. మీరు చేస్తున్న కార్యక్రమాలు మా అందరికీ స్ఫూర్తి దాయకంగా వుంటున్నాయి. మీరు కార్యక్రమాల విశేషాల్నీ, వీడియోలనీ వెబ్ లో ఉంచడం వల్ల మేము ప్రత్యక్షంగా చూసిన అనుభూతిని పొందుతున్నాము. మేము ఎప్పుడైనా పదిమందిమి తెలుగు వాళ్ళం కలిస్తే మీ వీడియోలని ఒక సారి చూడడం తప్పని సరిగా జరుగుతుంది. .. మా కార్యక్రమాలని కూడా మీ స్థాయిలో జరపడానికి కృషి చేస్తున్నాం. ఇందుకు మీ సహాయ సహకారాలు కావాలి' అన్నారు. సిలికానాంధ్ర ఇందుకు ఎల్లప్పుడూ సంసిద్ధంగా వుంటుందని సిద్ధార్థ హామీ ఇచ్చారు.



## మానవత్వం పరిమళించే సుప్రభాతం

"మనిషి కి కావల్సింది దేముడూ, మతాలూ,మొక్కుబళ్ళూ కాదు..జాలీ, దయా..! అది ఏ కొంచెమైనా చాలు.." అంటారు ప్రఖ్యాత రచయిత బుచ్చిబాబు. 'మానవసేవే మాధవసేవ' అని మన పెద్దవాళ్ళు ఎప్పుడో చెప్పారు. నాగరికత నేర్చిన మనుషులుగా ఉన్న మనం, మనకంటే తక్కువ స్థాయిలో ఉన్న వారిని గుర్తించి ఆదుకోవడం మన కనీస ధర్మం, అదే మానవత్వం! ముఖ్యంగా తినడానికి తిండి లేని వారికి కనీసం ఒక్క పూటైనా, మనకి వీలైనంతలో.. , తిండి పెట్టగలిగితే, మనలోని మానవత్వానికి అర్థముంటుంది. ....ఇలాంటి సేవాభావంతోనే గత నాలుగేళ్ళుగా మల్లాది రఘు, మల్లాది శ్యామల దంపతులు ఫ్రీమాంట్ పట్నం లోని 'Tricity Homeless Shelter' కేంద్రంలో సేవ చేస్తున్నారు. ప్రతి శనివారం తెల్లవారు ఝామున 5 గంటలకే సెంటర్ కి వెళ్ళి, అక్కడ వుండే 80-90 మంది అనాధలకి అల్పాహారం తయారు చేసి వడ్డిస్తున్నారు. ఈ అల్పాహారానికి కావల్సిన ముడిపదార్థాలన్నింటినీ వీరే కొనుగోలు చేసి తీసుకెళ్తారు. సిలికాన్ వేలీ జీవితం వీళ్ళని ఎంత బిజీ గా వుంచినా శనివారం పొద్దున్నే మాత్రం ఏ మాత్రం క్రమం తప్పకుండా అక్కడికి వెళ్తారు. 'మేము వెళ్ళక పోతే 80-90 మందికి ఆ రోజు బ్రేక్ ఫాస్ట్ ఉండదు. మేము వండి వడ్డిస్తున్నప్పుడు వాళ్ళ కళ్ళల్లో కనిపించే తృప్తి, ఆనందం మాకు ఎక్కడలేని ఉత్తేజాన్ని కలిగిస్తుంది' అంటారు రఘు, శ్యామల. వీరిని చూసి వీళ్ళ మిత్రులు శ్రీకాంత్, శంకర్, సంతోష్ లు కూడా ఈ సేవాకార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారు.

ఇలాంటి సేవాతత్పరత గల వ్యక్తులు సిలికానాంధ్ర సంస్థలో క్రియాశీలక కార్యకర్తలుగా ఉండడం .. సిలికానాంధ్ర కి ఎంతో గర్వకారణం..

బ్రేక్ ఫాస్ట్ కి పదార్థాలని సిద్ధం చేస్తూ



పాన్ కేక్ లు తయారు చేస్తూ





అనాధలకు అల్పాహారం లో ఆత్మీయత రంగరించి..

సుజనరంజని